# “సహాయ్యం”




## ఎన్. రవి

“యువ నాయకులు శ్రీ మైసయ్యగారి నాయకత్వం వర్ధిల్లాలి”
“ప్రజా సేవ పార్టీ జిందాబాద్”

తాటికాయంత అక్షరాలతో రాసిన పెద్ద పెద్ద బేనర్లు రంగురంగు కాగితాల తోరణాలు, పార్టీ జెండాలతో ఆ ఊళ్లోని వీధులన్నీ కొత్త అందాలను సింగారించుకున్నాయి.

అదో మారుమూల గ్రామం పుట్టి పట్నంలో డిగ్రీ వరకూ చదువుకొని రాజకీయాల్లోకి చేరిన మైసయ్యకు 'ప్రజాసేవపార్టీ' తరఫున ఎం.ఎల్.ఎ. టిక్కెట్టు దొరికి ఎన్నికల్లో విజయం సాధించాడు. అదృష్టవశాత్తు 'ప్రజాసేవపార్టీ' మెజారిటీ స్థానాలు సంపాదించటం వల్ల యువనాయకుడు మైసయ్యకు మంత్రివర్గంలో స్థానం కల్పించి, చిన్నతరహా నీటిపారుదల శాఖను అప్పగించటం జరిగింది.

మంత్రి పదవిని చేపట్టిన మూడు నెలల తరువాత ప్రప్రథమంగా మైసయ్య తన స్వగ్రామాన్ని సందర్శించబోతున్నారు. అందుకే అట్టహాసంగా స్వాగత సన్నాహాలు, భారీ ఏర్పాట్లు, తతంగం వగైరా...తమ గ్రామానికి చెంది, తాము గెల్పించిన నాయకుడు రాష్ట్రమంత్రి హోదాలో తమ గ్రామాన్ని సందర్శించబోతుండటం గ్రామ ప్రజానీకానికి ఆనందం, సంతోషం కలిగాయి. గ్రామం మన నిత్యం తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రిగారి దృష్టికి తేవాలని గ్రామ పెద్దలు అనుకొంటున్నారు. రైతులు తమ కష్ట నష్టాలు చెప్పుకుని మంత్రిగారి సహాయాన్నాసించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఆడవాళ్ళు తమ గ్రామంలో మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేయమని అడగాలని నిశ్చయించుకున్నారు.

మధ్యాహ్నం మూడుగంటలకల్లా గ్రామప్రజ అంతా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేయబడిన మంత్రిగారి బహిరంగ సభకు తరలిరావల్సిందిగా పార్టీకార్యకర్తలు వీధివీధిన తిరుగుతూ మైకుల్లో ఎనౌన్స్ చేశారు.

గ్రామ ప్రజలు ఒక అర్ధగంట ముందే అంటే రెండున్నర గంటలకే పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన స్టేజీ ముందుకొచ్చి కూర్చున్నారు. స్టేజీ అంతా రకరకాల పూలదండలతో, రంగురంగు కాగితాలతో, పెద్ద పెద్ద బెలూన్లతో సుందరంగా అలంకరించబడి వుంది. పాఠశాల ఆవరణలో దాదాపు పదిమంది పోలీసులు సాయుధులై అటూ ఇటూ పచార్లు చేస్తున్నారు.

తమ ప్రియతమ నాయకుని కోసం స్టేజీ ముందు కూర్చున్న ప్రజల వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు. సమయం మూడు గంటలు దాటినా గానీ మంత్రిగారు రాకపోయేసరికి కొందరు యువకులు అసహనానికి గురియగుతున్నారు. మంత్రిగారు మరికొద్ది నిముషాల్లో మన మధ్యకు రాబోతున్నారు” అని కార్యకర్తలు మైకుల్లో చెబుతూ వారి అసహనాన్ని పోగొట్టటానికి ప్రయత్నిస్తున్నారు.

సమయం మూడున్నర గంటలు కావస్తుండగా 'రయ్' మంటు 'పోలీస్ ఎస్కార్ట్' జీప్ ఒకటి స్టేజీ ముందుకొచ్చి ఆగింది. దాని వెనకనే వచ్చిన తెల్లని అంబాసిడర్ కారులోంచి మంత్రి మైసయ్య, పార్టీ కార్యదర్శి, మరో ఇద్దరు ఎం.ఎల్.ఎ.లు కూడా క్రిందికి దిగారు మంత్రిగారి కారుని మరో నాలుగు కార్లు, ప్రభుత్వ శాఖలకు చెందిన రెండు జీపులు కూడా అనుసరిస్తూ వచ్చి స్టేజీ ముందాగాయి.

ప్రజలంతా “మంత్రి మైసయ్యగార్కి జిందాబాద్!” మైసయ్య గారి నాయకత్వం వర్ధిల్లాలి అని పెద్దపెట్టున హర్షధ్వానాలు చేయసాగారు.

మరో రెండు నిముషాల్లో మంత్రి మైసయ్య గారు, పార్టీ కార్యదర్శి, ఎం.ఎల్.ఎ లు స్టేజీపైన ఏర్పాటు చేసిన కుర్చీల్లో ఆసీనులైనారు. పార్టీ కార్యదర్శి అధ్యక్షతన మంత్రి మైసయ్యగార్కి ఘనంగా సన్మానం జరిగింది. అనంతరం గ్రామ ప్రజలు కూడా ఒక్కొక్కరు స్టేజీపైకి వెళ్లి ఆయన

మెడలో పూలదండవేసి తమ సమస్యలను గూర్చి రాసివున్న వినతి పత్రాలను మంత్రిగారి చేతిలో వుంచి తమ భక్తి శ్రద్ధలను కనబరచారు.

అనంతరం మైసయ్యగారు ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ "నా గ్రామ ప్రజలారా! ఎన్నికల్లో నన్ను అత్యధిక ఓట్ల మెజారిటితో గెల్పించినందుకు నేను మీకు చాలా కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఈ రోజు నేనీ స్థానంలో వున్నానంటే అందుక్కారణం మీరే. ఈ మన గ్రామంలో ఏయే సమస్యలున్నాయో రాజధానిలోనే వుండి తెల్సుకుని వాటి పరిష్కారాన్ని ఆయా శాఖాధికారులకు ఆదేశాలివ్వటం జరిగింది. అంతే కాదు సన్నకారు, చిన్నకారు రైతాంగాన్కి రుణాలు సబ్సిడి ధరలపై విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఇప్పించదల్చుకున్నాము"

సభలో ఒక్కసారిగా పెద్దపెట్టున చప్పట్లు! "అంతేగాదు ఆడవాళ్ల మంచినీటి కోసం తీవ్ర అవస్థలకు గురియగుతున్నటుల తెల్సింది. అందుకోసం పదిలక్షల రూపాయల వ్యయంతో ఒక మంచినీటి పథకాన్ని ఈ గ్రామంలో నిర్మించతలపెట్టాము. మరో వారం రోజుల్లో పనులు కూడా ప్రారంభం అవుతాయి."

మరోసారి ఆనందంలో పెద్దపెట్టున చప్పట్లు, ఈలలు, "యువమంత్రి మైసయ్యగార్కి....జై!"

"మైసయ్య గారి నాయకత్వాం!... వర్ధిల్లాలి"

"ప్రజాసేవ పార్టీ.... జిందాబాద్!" నినాదాలు మరో అర్ధగంటలో సభ ముగిసింది.

ఎవరిదారిని వారు వెళ్లారు.

మంత్రి మైసయ్యగారు ఆ ఊర్లోనే రోడ్లు—భవనాల శాఖకు చెందిన విశ్రాంతి భవనంలో విడిది చేశారు. రాత్రి ఏడు గంటలకల్లా రొయ్యల వేపుడు, చికెన్ బిర్యాని ఇత్యాది ఖరీదయిన వంటకాలతో మంత్రిగారు భోజన కార్యక్రమాలు ముగించుకుని సోఫాలో మేనువార్చి విశ్రాంతి తీసుకుంటున్నారు.

"సార్! గోపాలరావు గారు టీచర్ అంట" మిమ్మల్ని కలవాలని వచ్చారు." సావధానంగా మంత్రిగారికి చెప్పాడు పి.ఎ.

"సరే పిలువ్!"

రెండు నిముషాలనంతరం "నమస్కారం అండి!" రెండు చేతులు జోడిస్తూ లోపలికొచ్చారు గోపాలరావు మాష్టారు.

"నమస్కారం!" ఆరే! మీరా మాష్టారూ! నేనెవరో అనుకుంటున్నాను." తను లేచి సావధానంగా తన కెదురుగానున్న కుర్చీలో గురువుగార్ని కూర్చోనబెట్టారు మంత్రి మైసయ్యగారు.

తన శిష్యుడు రాష్ట్రమంత్రి హోదాలో వుండి కూడా తనకంత గౌరవం ఇచ్చినందుకు మాష్టారి హృదయం ఆనందంతో నిండిపోయింది.

"బావున్నారా మాష్టారూ! మిమ్మల్ని చూసి చాలా కాలం అయ్యింది." ఆప్యాయంగా పలుకరించారు మంత్రిగారు.

తన యోగక్షేమాలను గూర్చి వివరంగా చెప్పారు మాష్టారు.

"నా శిష్యుడు ఈ రాష్ట్రాన్కి మంత్రయి, రాష్ట్ర ప్రజలకు సేవ చేసేస్తుండటం నాకెంతో గర్వంగా వుంది బాబూ!"

"అంతా మీ దయ మాష్టారు! సరే! ఇంతకీ మీరొచ్చిన పనేమిటో చెప్పనేలేదు...?"

"అదీ!...అది"... మాటలు మింగుతూ సందేహిస్తున్నారు గోపాలరావు మాష్టారు.

"ఫరవాలేదు చెప్పండి మాష్టారూ!"

"అదీ! మా పెద్దబ్బాయిని రెక్కలు ముక్కలు చేసుకుని ఇంజనీరింగు చదివించాను. చదువు పూర్తి చేసుకుని రెండేళ్లవుతుంది. గానీ ఉద్యోగం దొరికేట్టులేదు. అపుడపుడు రాతపరీక్షలకీ, ఇంటర్వ్యూలకు వెళుతున్నాడు. జవాబులు సరిగ్గానే ఇస్తున్నానని చెబుతున్నాడు. గానీ ఉద్యోగం మాత్రం దొరకటంలేదు. మొన్నీమధ్యనే మీ శాఖ ఆధీనంలో వున్న ఒక సంస్థలో జూనియర్ ఇంజనీరు ఉద్యోగాన్కి ఇంటర్వ్యూకెళ్లి వచ్చాడు. "ఇంటర్వ్యూలో అడిగిన వాటిన్నంటికీ తాను సరిగ్గా, చక్కగా సమాధానాలు చెప్పాననీ, ఉద్యోగం తప్పనిసరిగా వస్తుందనీ" అంటున్నాడు. అయినా గానీ నాకు పూర్తి నమ్మకంలేక మీకోమారు ఈ విషయం చెప్పిపోదామని వచ్చా... నేను చేస్తున్న పని అక్షరాల తప్పు అని నాకు తెల్సు బాబూ! కానీ నాకొచ్చే నాలుగొందల రూపాయ పెన్షన్‌తో గంపెడు సంసారాన్ని నెట్టుకురాలేక పోతున్నాను. చావకుండా బతక్కుండా రోజులు నెట్టుకురావటం జరుగుతుంది. మంచి చదువుండి, ప్రతిభ వుండి కూడా పెద్దబ్బాయి నిరుద్యోగుల జాబితాలో వుండిపోయాడు, ఇంట్లో పెళ్ళికెదిగిన అమ్మాయిలు ఇద్దరు గుండెలపై కుంపట్లలాగా వున్నారు. ఈ పరిస్థితిలో మావాడికి ఆ ఉద్యోగం వస్తే కాస్తంత ఊరట గల్గుతుంది. మా కష్టాలు గట్టెక్కగలవు అనుకుంటున్నాను... కనుల వెంబడి జారుతున్న కన్నీటిని తుడుచుకుంటూ చెప్పారు మాష్టారు.

"మాష్టారూ! మీ సమస్యను నేను అర్థం చేసుకున్నాను. మీ అబ్బాయికి తప్పకుండా ఉద్యోగం వచ్చే ఏర్పాటు చేస్తాను. మీరు నిశ్చింతగా వెళ్లండి!" గట్టిగా ధైర్యం చెప్పారు. మంత్రిగారు "అలాగే!" అంటూ అబ్బాయి పేరు వివరాలు రాసున్న చీటిని మంత్రిగారి చేతికి అందించి అక్కణ్ణుంచి సెలవు తీసుకున్నారు మాష్టారు.

మరో అర్ధగంట సమయం గడిచాక "క్రింగ్! క్రింగ్!" అని ఫోన్ మోగింది.

"హోం మంత్రి గారి దగ్గర్నుంచి సార్ ఫోన్" రిసీవర్ అందిస్తూ చెప్పాడు పి.ఎ.

"హల్లో! హోం మంత్రిగారా! ఏంటి చెప్పండి సార్!"

దాందేముంది సార్! అలాగే!

........

"ఓ!"

"థాంక్యూ సర్! థ్యాంక్యూ వెరీమచ్!" నవ్వుతూ ఫోన్ పెట్టేసారు మంత్రిగారు.

"వెంకటస్వామి!?" పిలిచారు మంత్రిగారు.

"ఏంటి సార్!" వినయంగా పలికాడు పి.ఎ.

"మొన్నీమధ్యన మన శాఖకు చెందిన సంస్థలో జూనియర్ ఇంజనీరు ఉద్యోగాలకి ఇంటర్వ్యూలు జరిగాయట. అందులో ఎన్నికయిన అభ్యర్థుల లిస్టు మన దగ్గరుందా!"

"ఆ ఉన్నది సార్!" రెండు క్షణాల్లో ఫైల్లో క్లిప్ చేసివుంచిన ఒక కాగితాన్ని తీసి మంత్రిగార్కి అందించాడు.

మొదట ఈ ఉద్యోగాన్ని మా గురువుగారి అబ్బాయికే ఇప్పిదాం అనుకున్నా. గానీ ఇందాక హోంమంత్రిగారు ఫోన్ చేసి ఈ ఉద్యోగం వాళ్ళ బామ్మర్దికి వేయించమన్నాడు. అలాగయితే మా బామ్మర్దికి ఆయన సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం వేయిస్తానన్నాడు.

"ఉన్న ఒకే ఒక ఉద్యోగాన్కి ప్రదీప్ కుమార్ సనాఫ్ గోపాలరావు ఎంపిక చేయబడినాడు" అని టైపు చేయబడివుందా కాగితంపైన.

"సరే అయితే! ఈ ఇంటర్వ్యూను నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు కాంతారావుకు ఫోన్ చేసి ఈ పేరు మార్చేసి, నేనిచ్చిన పేరుని సెలక్షన్ లిస్ట్‌లో టైప్ చేయమని చెప్పు" ఆదేశించారు మంత్రిగారు. తెల్లకాగితం మీద తను కోరిన పేరును రాస్తూ...

"సర్! ఎన్నికయ్యిన అభ్యర్థి మీ గురువుగారి కొడుకే గదా... మరి!... పూర్తిగా చెప్పే ధైర్యం లేక మాటలు మింగసాగాడు పి.ఎ. వెంకటస్వామి.

"ఆ సంగతి నాకు తెలవదా! మొదట ఈ ఉద్యోగాన్ని మా గురువుగారి అబ్బాయికే ఇప్పిద్దాం అనుకున్నా. గానీ ఇందాక హోంమంత్రిగారు ఫోన్ చేసి ఈ ఉద్యోగం వాళ్ళ బామ్మర్దికి వేయించమన్నాడు. అలాగయితే మా బామ్మర్దికి ఆయన సబ్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగం వేయిస్తానన్నాడు. గురువుగారబ్బాయికి ఈ దఫా తప్పనిసరిగా ఉద్యోగం ఇప్పిస్తాను" తన నిర్ణయాన్ని తెలివిగా చెప్పుకుపోతుంటే గుడ్లప్పగించి, తెల్లగా చూస్తూ వుండిపోయాడు పి.ఎ. వెంకటస్వామి. ●